# ప్రజా పాలన సభలకు 58 టీమ్‌లు

- ఒక టీమ్ రోజుకు రెండు సభల నిర్వహణ
- వంద కుటుంబాలకు ఒక కౌంటర్
- ఇతర సమస్యల దరఖాస్తులకు జనరల్ కౌంటర్
- గ్రామాల వారీగా షెడ్యూల్ విడుదల
- విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక



సూర్యాపేట : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక, పక్కన అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట, డిసెంబర్ 27 : ప్రజా పాలన సభలో ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావుతో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఈ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలు, 141 మున్సిపల్ వార్డుల్లో ఈ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. 475 గ్రామ పంచాయతీల్లో 247 మంది సభ్యులతో 46 టీమ్‌లను ఏర్పాటు చేయగా ఈ టీమ్‌లు 2,581 కౌంటర్లలో దరఖాస్తులు తీసుకుంటాయన్నారు. అలాగే ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డుల్లో 52 మంది సభ్యులతో 12 టీమ్‌లను ఏర్పాటు చేయగా 844 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 3,425 కౌంటర్ల ద్వారా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అందుకు గ్రామ సభల నిర్వహణకు 299 మంది సభ్యులతో మొత్తం 58 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒక టీమ్ రోజుకు రెండు గ్రామ సభలను నిర్వహిస్తుందని, మొత్తంగా రోజుకు 116 గ్రామ సభల నిర్వహణ జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామ సభ ఉంటే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో నిర్వహించే గ్రామ సభలో టీమ్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. గ్రామ సభ నిర్వహణ ముందు ఆ గ్రామంలో గానీ వార్డులో కాని ఇంటింటికీ దరఖాస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఉంటుందన్నారు. కౌంటర్ ఇన్‌చార్జీలను సైతం నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఈ ఆరు గ్యారెంటీల కోసమే కాకుండా ఇతర సమస్యలను విన్నవించేందుకు జనరల్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ సభ ముగిసిన తర్వాత మిగిలిన రోజుల్లో ఒక కౌంటర్‌ను నిర్వహిస్తామన్నారు. జనవరి 6 వరకు ఈ కౌంటర్ పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రేషన్ కార్డు, ఆధార్‌తో పాటు ఫామ్ నింపుకుని రావాలని సూచించారు. ఫామ్ ఇచ్చిన అనంతరం రశీదు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారికేడ్లతో పాటు కౌంటర్ వద్ద ఒక కానిస్టేబుల్ ఉంటారని చెప్పారు.

### దరఖాస్తుల స్వీకరణపై అవగాహన

ఆత్మకూర్.ఎస్ : ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణపై మండల ప్రత్యేక అధికారులు నాగేంద్రశర్మ, వెంకట్‌రెడ్డి అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, డీటీ పుష్ప, ఎంపీఓ సంజీవ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### గ్రామ సభల ఏర్పాట్ల పరిశీలన

అర్వపల్లి : మండలంలోని కాసర్లపహాడ్, నాణ్యతండాలో నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభల ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ పరిశీలించారు. అలాగే ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు అన్నారు.

సూర్యాపేట రూరల్ : మండలంలోని ఆరెగూడెం, సఫావత్‌తండాలో గ్రామ సభల నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ భద్రూనాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, మిషన్ భగీరథ ఏఈ భరత్‌కుమార్, సీడీపీఓ కిరణ్మయి, పశు వైద్యాధికారి గోపి పాల్గొన్నారు.

తుంగతుర్తి : నేటి నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ భీమ్‌సింగ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### నాగారం మండలంలో..

నాగారం : గ్రామ సభల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ గాలి శోభారాణి తెలిపారు. 28న మాచిరెడ్డిపల్లి, పేరబోయినగూడెం, శాంతినగర్, లక్ష్మాపురం, 29న ఈటూరు, నాగారం, 30న ఫణిగిరి, వర్ధమానుకోట, 2న నాగారం, బంగ్లా, మామిడిపల్లి, డి.కొత్తపల్లి, 3న పస్తాల, పసునూరు, 4న నర్సింహులగూడెంలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

### ప్రజా పాలన సభలకు ప్రత్యేక అధికారులు

సూర్యాపేట : ప్రజా పాలన సభలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట రూరల్-శిరీష, చివ్వెంల-జగదీశ్వర్‌రెడ్డి, పెన్‌పహాడ్-రాంపతినాయక్, నూతనకల్-సుధాకర్‌రెడ్డి, తిరుమలగిరి-మధవరెడ్డి, మద్దిరాల-శ్రీధర్, జాజిరెడ్డిగూడెం-రామారావునాయక్, మేళ్లచెర్వు-నామ శ్రీధర్, మోతె-తిరుపతిరెడ్డి, కోదాడ రూరల్-దయానందరాణి, చిలుకూరు-రూపేందర్‌సింగ్, మునగాల-శ్రీరాములు, చింతలపాలెం-నాగేందర్, నడిగూడెం-సతీశ్‌కుమార్, తుంగతుర్తి-జగ్గూనాయక్, ఆత్మకూర్(ఎస్)-నాగేశ్వర్‌శర్మ, గరిడేపల్లి-సంతోశ్‌రావు, నేరేడుచర్ల-జ్యోతిపద్మ, పాలకవీడు-శంకర్, హుజూర్‌నగర్-యాదయ్య, అనంతగిరి-డాక్టర్ శ్రీనివాస్, నాగారం-సాంబిరెడ్డి, మఠంపల్లి-నవీకాంత్ నియమితులయ్యారు. వారికి తోడుగా మండల అధికారులు విధులు నిర్వహించనున్నారు.

**ప్రజా పాలన సభల కోసం జిల్లా స్థాయి టీమ్**

| ప్రత్యేక అధికారి | హోదా | చేయాల్సిన విధులు |
|---|---|---|
| సీహెచ్ ప్రియాంక | అదనపు కలెక్టర్ | ప్రజా పాలన జిల్లా ఇన్‌చార్జి |
| వెంకట్‌రెడ్డి | అదనపు కలెక్టర్ | డాటా ఎంట్రీ ఇన్‌చార్జి |
| వీరబ్రహ్మచారి | ఆర్డీఓ సూర్యాపేట | డివిజన్ ఇన్‌చార్జి |
| సూర్యనారాయణ | ఆర్డీఓ కోదాడ | డివిజన్ ఇన్‌చార్జి |
| జగదీశ్వర్‌రెడ్డి | ఆర్డీఓ హుజూర్‌నగర్ | డివిజన్ ఇన్‌చార్జి |
| యాదయ్య | డీపీఓ | హుజూర్‌నగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి |
| వెంటేశ్వర్లు | సీపీఓ | కోదాడ నియోజక వర్గ ఇన్‌చార్జి |
| సురేశ్ | సీఈఓ జడ్పీ | సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జి |
| కిరణ్‌కుమార్ | డీఆర్‌డీఓ | తుంగతుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి |



మోత్కూరులో విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

## ఉద్యోగ ఉపాధ్యాయులకు అండగా ఉంటాం

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, డిసెంబర్ 27 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరించనున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. బుధవారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన విశ్రాంత ఉద్యోగుల భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 70 ఏండ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్లు, అదనపు భవన సముదాయానికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. టీఎస్ఆర్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి ఆనందం, మోత్కూరు కార్యాలయ అధ్యక్షుడు యాదిరెడ్డి, కార్యదర్శి వల్లభాయి, కోశాధికారి వి.యాదగిరి, చందర్‌రావు పాల్గొన్నారు.

## అయ్యప్ప మండల పూజా మహోత్సవం



అయ్యప్పకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తున్న మాలధారులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 27 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శబరినగర్ ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ప్రాంగణంలో ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప స్వామి మండల పూజా మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ సుందరి కిరణ్‌కుమార్, సేవా సమితి అధ్యక్షుడు యర్రంశెట్టి ఉపేందర్, చిత్తలూరి కోటేశ్వర్‌రావు స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మాలధారులు, భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు వెంపటి పురుషోత్తం, అంతటి విజయ్, గురుస్వామి దేవయ్య పాల్గొన్నారు.

### విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చివ్వెంల, డిసెంబర్ 27 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ రాములు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లిలో గల ప్రతిష్ఠ ఫార్మసీ కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, రక్షణ, డయల్ 100, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సాయి శంకర్, వెంకట్‌రెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### గడ్డివాము దగ్ధం

నాగారం, డిసెంబర్ 27 : మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బుర్ర యాదగిరి పశువుల పాకలోని గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డివాము దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఎగసి పడుతున్న మంటలను ఆర్పేసింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

### బడి బయటి పిల్లల సర్వే

నూతనకల్, డిసెంబర్ 27 : మండలంలోని పెదనెమిల గ్రామంలో బుధవారం సీఆర్పీ కనకం రవీందర్ బడి బయట ఉన్న పిల్లల వివరాల నమోదుకు సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడి బయట ఉన్న పిల్లల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల 14 వరకు సర్వే జరుగుతుందని చెప్పారు.

### వామనాశ్రమ మహా స్వామిజీ సూర్యక్షేత్ర సందర్శన



సూర్యక్షేత్రంలో స్వామిజీ

అర్వపల్లి, డిసెంబర్ 27 : మండలంలోని తిమ్మాపురంలో గల సూర్యక్షేత్రాన్ని వైశ్య గురు మతాధిపతి, కర్ణాటక హల్లీపూర్ వామనాశ్రమ మహా స్వామిజీ బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో 102 వాసవి మాత దేవాలయాల్లో కోటి పుష్పార్చన కార్యక్రమం జరుగుతుందని, వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ వైశ్య గురు సేవా సమితి సభ్యుడు ఈగా దయాకర్‌గుప్తా, మిర్యాల శివకుమార్, పురుషోత్తమ్ పాల్గొన్నారు.

### సీపీఎం సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి మృతి

ఆత్మకూర్.ఎస్, డిసెంబర్ 27 : సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన కోతి లక్ష్మారెడ్డి గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండ వెంకట్‌రెడ్డి, వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి అవిర అప్పయ్య, గ్రామ శాఖ కార్యదర్శి బెల్లంకొండ చక్రయ్య, ఎల్లయ్య, భాగ్యమ్మ, విజయరెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ విద్యా విధానం నుంచి రాష్ట్రం వైదొలగాలి

● కవి కస్తూరి ప్రభాకర్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 27 : జాతీయ విద్యా విధానం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వైదొలగాలని రచయిత, కవి కస్తూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రతిభా జూనియర్ కళాశాలలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తి సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూలన, శాస్త్రీయ విద్యపై పోరాటాలు నిర్వహించాలన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్న ఆర్టికల్ 51ఏహెచ్‌కు విరుద్ధంగా డార్విన్ పరిణామ విధానాన్ని, పీరియాడిక్ టేబుల్‌ను, ప్రజాస్వామ్యాన్ని గుర్చిన పాఠాలను తొలగించడం భవిష్యత్ తరాలను అంధకారంలో నెట్టి వేయడమే అన్నారు. అందుకే రాష్ట్ర అవసరాలకు తగిన శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను పాఠశాల విద్యా వ్యవస్థలో కొనసాగించాలన్నారు. సభలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, రిటైర్డ్ తాసీల్దార్ లింగంపల్లి భద్రయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల లింగయ్య, టీపీటీఎఫ్ జిల్లా కన్వీనర్ కోటయ్య, పీడీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మరికంటి హరీశ్ పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

● ఎంపీడీఓ ఇందిర

నూతనకల్, డిసెంబర్ 27 : మండల వ్యాప్త గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీడీఓ ఇందిర తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఎంపీఓ శశికళ పాల్గొన్నారు.